క్లుప్తంగా

ఘనంగా వార్షికోత్సవం



విస్సన్నపేట: స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న కనకదుర్గా అమ్మవారి దేవస్థానం 23వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో 108 కలశ పూజలు, అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ కుక్కడపు ప్రసాదరావు, గంధం సత్య హనుమంతరావు దంపతులు కలశ పూజలు నిర్వహించారు.

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు ప్రారంభం



తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ఆరంభించిన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలన్నారు. తప్పనిసరిగా బ్యాంకు ఖాతాలు తెరిచి పొదుపు పాటించాలన్నారు. ప్రతినెలా కుటుంబంలో జరిగే ఆదాయ వ్యయాలు సమీక్షించుకుని ఆర్థిక ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సృజన కుమార్ బ్యాంకు ద్వారా కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. బ్యాంకు సేవల కరపత్రాలు అందజేశారు. ఆర్థిక అక్షరాస్యత కేంద్రాల జిల్లా సమన్వయ కర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎల్బీఆర్సీఈ అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం



మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఎల్బీఆర్సీఈ)లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఏ. కొండూరు మండలం, గోపాలపురం గ్రామానికి చెందిన డాక్టర్ బి. శివరామకృష్ణ పీహెచ్‌డీ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. అప్పారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై బి. శివరామకృష్ణ చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ ప్రదానం చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పీహెచ్‌డీ అవార్డు పొందిన శివరామకృష్ణను కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. హరినాథరెడ్డి, డాక్టర్ ఎం. శ్రీనివాసరావు, అధ్యాపకులు అభినందించారు.

న్యాయవాదికి నివాళి

నూజివీడు: ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతిచెందిన న్యాయవాది పేర్ల రామలింగేశ్వరరావుకు నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా 15వ అదనపు జిల్లా జడ్జి ఏ.నాగశైలజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే విక్రమ్‌కుమార్, కార్యదర్శి వై.హరిబాబు, పలువురు న్యాయవాదులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి ఏ.నాగశైలజ మాట్లాడుతూ రామలింగేశ్వరరావు కుటుంబానికి అందరూ అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గోళ్ల ప్రసాదరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎస్సీ వర్గీకరణపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ పిలుపు మేరకు సోమవారం జరిగిన జాతీయ రహదారుల దిగ్బంధంలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణ చోటుచేసుకుంది. రింగ్ సెంటర్ వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై వాహనాలు నిలువరించి రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకులను సీఐ పి. శ్రీను ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్, సిబ్బంది పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

సారా విక్రేతల అరెస్టు

తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సోమవారం జరిపిన దాడుల్లో నలుగురు సారా విక్రేతలను అరెస్టు చేశారు. ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ గురవయ్య తెలిపిన వివరాల మేరకు విస్సన్నపేట మండలంలోని వేమిరెడ్డిపల్లి, తాతకుంట్ల, చంద్రుపట్ల తండాలలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకుని దాడి నిర్వహించామని, ముగ్గురు మహిళలు, ఒక యువకుడిని సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. నిందితులను మైలవరం కోర్టులో హాజరు పరచగా, మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించారని తెలిపారు.

భక్తుల భద్రతే ప్రాధాన్యం

బలివే ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అధికారుల బృందం



బలివే మహోత్సవాలకు ముస్తాబైన ఆలయం

బలివే(ముసునూరు): మహాశివరాత్రికి బలివే రామలింగేశ్వర స్వామి ఆలయం ముస్తాబవుతోంది. లక్షలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో అందుకు తగినట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయానికి కొత్త రంగులు అద్దుతున్నారు. క్యూ లైన్ల నుంచి దర్శనం పూర్తయ్యి బయటకు వచ్చే వరకూ.. బయట స్టాళ్ల నిర్వహణ తదితర వాటిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఈ మేరకు సోమవారం అధికారులు బలివేలోని ఆలయ పరిసరాల్లో పర్యటించారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యం..

భక్తుల సౌకర్యాలు, భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, అధికారులు, నేతల సమన్వయం, స్వచ్ఛంద సేవా సంస్థల సహకారంతో బలివే మహా శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయనున్నట్లు ఉత్సవాల నోడల్ అధికారి, తహసీల్దార్ దాసరి సుధ, సర్పంచ్ రావు ప్రవీణ సుధాకర్ పేర్కొన్నారు. బలివే రామలింగేశ్వర ఆలయం వద్ద ఉత్సవాల ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్షలాదిగా భక్తులు హాజరయ్యే బలివే మహోత్సవాల్లో మహిళా భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించామన్నారు. భక్తుల స్నానాలు, దైవ దర్శనానికి, ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఆలయ, ఉత్సవ ప్రాంగణాలలో ప్రసాదాల కౌంటర్లు, స్నాన ఘట్టాలు, మంచినీరు అందించే చోట్ల మహిళా సిబ్బందితో రద్దీని నివారించే ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవ ప్రాంగణ పరిసరాలలో మద్యం విక్రయాలు లేకుండా అన్ని శాఖలను అప్రమత్తం చేశామన్నారు. అనంతరం క్యూలైన్ల కోసం నిర్మించిన బారికేడ్ల ఏర్పాట్లను పరిశీలించారు. దేవదాయ, రెవెన్యూ, పంచాయితీరాజ్ శాఖల సమన్వయంతో మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయనున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు రావు సుధాకర్, ఆర్‌ఐ చంద్రశేఖర్, ఆలయ ప్రధానార్చకులు తోలేటి అరుణ భాస్కర్, అమర్‌బాబు, శ్రీహరి సారథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొత్తరంగులద్దుకున్న కల్యాణోత్సవ మండపం



ఆలయం లోపల నాగేంద్రస్వామి పుట్ట



స్నానాల రేవు వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

ఎ.కొండూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటల ఉత్పత్తుల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, వ్యవసాయ శాఖ అధికారి టిప్పు సుల్తాన్ పరిశీలించారు. బియ్యం, కూరగాయాలు, ఆకుకూరాలు, పండ్లు, తేనె వినియోగదారులకు విక్రయించారు. ఈ కూరగాయలు తినడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ స్రవంతి, బెంజిమెన్ పలువురు పాల్గొన్నారు.



వినియోగదారులకు కూరగాయాలు అందిస్తున్న తహశీసీల్దార్ వెంకటేశ్వర్లు

ప్రకృతి వ్యవసాయంపై వినూత్న ప్రచారం

మైలవరం: ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించే విధంగా రైతు కోసం వ్యవసాయ శాఖ వినూత్న ప్రచారం ప్రారంభించింది. మైలవరం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో స్టాల్‌ను సోమవారం ఏర్పాటు చేసి వ్యవసాయ శాఖ సిబ్బంది విక్రయిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమానికి, అదే ప్రాంగణంలోని వివిధ ప్రభుత్వ శాఖల మండల కార్యాలయాలు, కోర్టు ఉండటంతో ప్రజలు ఎక్కువ సంఖ్యలో వస్తారన్న ఆలోచనతో ఈ ప్రాంతాన్ని ఎంచుకున్నట్లు వ్యవసాయ శాఖ సిబ్బంది తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రతి రోజు ఒక ప్రాంతంలో స్టాల్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వినియోగదారులు ఆసక్తి చూపిస్తూ ధరలు కూడా అందుబాటులో ఉండటంతో కొనుగోలు చేస్తున్నారు.



మైలవరం మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ప్రతి పంటకూ ఈ-క్రాప్ తప్పనిసరి

ముసునూరు: ప్రతి పంటకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయ డెప్యూటీ డైరెక్టర్ ఏ.శారద పేర్కొన్నారు. మండలంలోని సూరేపల్లిలో రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేస్తున్న 35 మంది రైతుల పంటల నమోదును సోమవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన పంటల నమోదు సక్రమంగా జరిగిందా లేదా అనే విషయంపై పరిశీలన చేశారు. పంటల నమోదు ప్రక్రియ తప్పులు లేకుండా సమగ్రంగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రైతు తాను పండిస్తున్న పంటలను తమ గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఆధార్ కార్డు, పాస్ పుస్తకాలు, ఇతర ఆధారాలతో నమోదు చేయించు కోవాలన్నారు. సున్నా వడ్డీతో రుణ సదుపాయాలు, వైఎస్సార్ రైతు భరోసా, పంటలకు నష్ట పరిహారం, బీమా సదుపాయం, ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీ విత్తనాలు, సబ్సిడీ ఎరువులు, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు తదితర పథకాల వర్తింపుకు ఈ క్రాప్ నమోదు అవసరం అన్నారు. పంటల నమోదు అనంతరం ఈకేవైసీ కూడా తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయ ఏ.ఓ పి.ప్రసన్న, మండల వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాసరావు, వీఆర్వో విజయకుమారి పాల్గొన్నారు.



సూరేపల్లిలో ఈ-క్రాప్ నమోదును తనిఖీ చేస్తున్న డీడీఏ శారద

నిష్పక్షపాతంగా ఈ-క్రాప్ నమోదు చేయాలి

మైలవరం: పంటలకు సంబందింధించి ఈ-క్రాప్ నమోదులో ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా నిష్పక్షపాతంగా నమోదు చేయాలని కమిషనరేట్ ఆఫ్ అగ్రికల్చర్, గుంటూరు జాయింట్ డైరెక్టర్ బి.పద్మజ తెలిపారు. మైలవరంలోని గోగులమూడి సత్యనారాయణరెడ్డికి చెందిన వరి పంటను వ్యవసాయాధికారులతో కలిసి సోమవారం జేడీ పద్మజ పరిశీలించారు. ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి సూపర్ చెక్ నిర్వహించారు. స్థానిక వ్యవసాయ శాఖ సిబ్బంది గతంలో చేసిన ఈ-క్రాప్ నమోదు సక్రమంగా ఉందా లేదా అని పొలం వద్దనే సిబ్బందితో కలిసి చెక్ చేశారు. పంటల బీమా సక్రమంగా అందాలంటే ఈ క్రాప్ న మోదు నిష్పక్షపాతంగా ఉండాలని తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతి రైతు వేసిన పంటను పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాల పనితీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. జేడీ పద్మజ వెంట మైలవరం సహాయ వ్యవసాయ శాఖాధికారి ఎం. శ్రీనివాసరావు, ఏఓ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



మైలవరం సమీపంలో పంటను పరిశీలిస్తున్న జేడీ పద్మజ, ఇతర వ్యవసాయాధికారులు

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

ఆగిరిపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని అడవినెక్కలం విద్యుత్ సబ్‌స్టేషన్ సెక్షన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల గృహాలు, వాణిజ్య సముదాయాలపై విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు 40 బృందాలుగా ఏర్పడి 2156 గృహ సర్వీసులు, 140 వాణిజ్య సముదాయాల సర్వీసులను తనిఖీ చేశారు. వీటిలో 145 సర్వీసులకు అదనపు లోడు కారణంగా రూ.4,62,000 జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం గుర్తించి ఐదుగురికి రూ.33 వేలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం జరిగినట్లు గుర్తిస్తే 9440812362, 9440812363, 83310 14951కు సమాచారం ఇవ్వాలని విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో నూజివీడు, విసన్నపేట, తిరువూరు మండలాల డీఈఈలు, ఏఈలు, విద్యుత్ విజిలెన్స్ డీఈఈలు, ఏఈలు, జేఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ వెంకటేశ్వర్లు, నూజివీడు ఈఈ కృష్ణనాయక్

నేడు వాహనాలకు వేలం పాట

నూజివీడు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడి వాహనాలకు ఈనెల 14న ఉదయం 10 గంటలకు స్థానిక పోలీసు స్టేషన్‌లో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ ఎంవీవీఎస్ఎన్ మూర్తి సోమవారం తెలిపారు. డీఎస్పీ ఈ. అశోక్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహిస్తున్నామన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు పట్టణ పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి తగిన డిపాజిట్ చెల్లించాలని, ఆధార్, పాన్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. వేలంలో వాహనాన్ని పాడుకొన్న తర్వాత పాడిన ధరపై 18 శాతం జీఎస్టీని చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

క్వారీలో తనిఖీలు

విజయవాడ రూరల్: పి.నైనవరం, పాతపాడు గ్రామాల్లో అక్రమంగా మైనింగ్ తవ్వకాలు జరుగుతున్నాయన్న ఆరోపణలపై సోమవా రం మైనింగ్ విజిలెన్స్ అసిస్టెంట్ జూయాలజిస్ట్ పురుషోత్తం తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా పోలవరం కాలువ గట్లకు ఆనుకొని జరుగుతున్న మట్టితవ్వకాలను ఆయన పరిశీలించారు. అయితే ఆయన తనిఖీ చేసిన సమయంలో తవ్వకాలకు సంబంధించిన మిషన్లు, వాహనాలు లేక పోవడంతో అక్కడ ఫొటోలను తీసుకొన్నారు. పి.నైనవరం గ్రామంలో అనుమతులున్నా పట్టా భూమిలో నిబంధనలు అతిక్రమించి తవ్వకాలు జరుపుతున్న క్వారీని ఆయన తనిఖీ చేశారు. తనిఖీల్లో ఏజీ పురుషోత్తంతో పాటు వీఆర్వో రఘు, విలేజి సర్వేయర్లు ఉన్నారు.

ఖాజీమాన్యంలో పూడికతీత పనులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం పరిధిలో ఖాజీమాన్యం వద్ద ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన జేసీబీతో ప్రధాన డ్రైనేజీలో పూడికతీత పనులు సోమవారం నిర్వహించారు. ఈ డ్రైనేజీ నుంచి ఎన్టీటీపీఎస్ కాలనీలతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన స్థానికుల వాడుకనీరు ప్రవహిస్తూ ఉంటుంది. పనులను మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

పేదల భూముల జోలికి వస్తే సహించం

మైలవరం: పేదల భూములు జోలికి వస్తే సహించేది లేదని సీపీఎం మైలవరం మండల నాయకులు సీహెచ్ సుధాకర్ తెలిపారు. మైలవరం పోలీస్ స్టేషన్‌లో మైలవరం, జి.కొండూరు మండలాలకు చెందిన భూ స్వాములపై సోమవారం ఎస్సీ, ఎస్టీ కేసులు పెట్టాలని సీపీ ఎం నాయకులు ఫిర్యాదు చేశారు. మైలవరం గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన భూములను కొంతమంది పొందుగల గ్రామం, జి.కొండూరు మండలానికి చెందిన కొందరు దళితులను బెదిరింపులకు దిగుతూ.. భూముల్లోకి వస్తే చంపుతామంటూ బెదిరిస్తున్నారని తెలిపారు. ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందజేసినట్లు సుధాకర్ తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి పేదల భూములకు రక్షణ కల్పించి, పేదలపై తప్పుడు కేసులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కమ్మేసిన పొగమంచు



ఇబ్రహీంపట్నం: జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజాము నుంచి దట్టమైన పొగమంచు అల్లుకుంది. ఉదయం 9గంటల దాటినా మంచు ప్రభావం వీడలేదు. హైవేపై వాహనదారులు లైట్లు వేసుకుని జాగ్రత్తగా ప్రయాణాలు చేయాల్సి వచ్చింది. దీంతో తెల్లవారుజాము నుంచి పనుల్లో నిమగ్నమైయ్యే వ్యవసాయ కూలీలు, చిరువ్యాపారులు, దుకాణదారులు, రైతులు ఒకింత అసౌకర్యానికి గురైయ్యారు.

తలశిల రఘురామ్‌ను పరామర్శించిన వైఎస్ విజయమ్మ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి సతీమణి, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తల్లి వైఎస్ విజయమ్మ పరామర్శించారు. రఘురామ్ సతీమణి స్వర్ణకుమారి అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విజయమ్మ సోమవారం సాయంత్రం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని రఘురామ్ నివాసానికి వచ్చిన ఆమె తొలుత స్వర్ణకుమారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం రఘురామ్‌ను ఓదార్చి సాంత్వన సంభాషణలతో మనోధైర్యాన్ని కల్పించారు. తమ కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా ఉన్న రఘురామ్ సతీమణి అకాల మరణం పొందటం దురదృష్టకరమని బాధాతప్త హృదయంతో అన్నారు. తమ కుటుంబం ఎప్పుడూ రఘురామ్ కుటుంబానికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే రఘురామ్ కుమార్తె ప్రణవ, సోదరులు దూళిపాళ శ్రీకాంత్, శ్రీనాథ్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కూడా రఘురామ్ ఇంటికి వచ్చి స్వర్ణకుమారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రఘురామ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాగా ఉదయం నుంచి పలువురు మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు వచ్చి రఘురామ్‌ను పరామర్శించి వెళ్లారు.



రఘురామ్‌ను పరామర్శిస్తున్న విజయమ్మ



తలశిల రఘురామ్‌ను, కుమార్తె ప్రణవను పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

నూజివీడు: స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని, లేకపోతే దానికి గల కారణం తెలపాలన్నారు. పరిష్కరించకుండా నిర్లక్ష్యంచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా స్పందన నిర్వహిస్తోందని, ఆ విషయాన్ని మండల, డివిజన్ స్థాయి అధికారులు గుర్తెరిగి నడుచుకోవాలన్నారు. స్పందనలో 12 అర్జీలు రాగా వాటిని సంబంధిత అధికారులకు పంపారు. స్పందనలో ఏడీఏ విద్యాసాగర్, హెచ్‌వో హేమ, ఐసీడీఎస్ సీడీపీవో శేషుకుమారి, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తోన్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

'స్పందన'లో ఐదు అర్జీలు

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఐదు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి తెలిపారు. కొత్తపల్లికి చెందిన ఆంజనేయులు రైస్‌కార్డులో తన పాప పుట్టిన తేదీ మార్చాలని, గంపలగూడెంకు చెందిన వెంపటి మహాలక్ష్మి తన తల్లిదండ్రుల ఆస్తి కూతుళ్ల అందరికీ సమానంగా పంపిణీ చేయాలంటూ దరఖాస్తులు ఇచ్చారు. పెదకొమిర నుంచి కె. సత్యనారాయణ ఓటర్ల జాబితాలో చనిపోయిన, దీర్ఘకాలంగా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి పేర్లు తొలగించాలని అర్జీ అందజేశారు. డప్పు కళాకారుల ఫించన్ కోరుతూ అనుములంకకు చెందిన బి. పూర్ణయ్య దరఖాస్తు ఇచ్చారు. పుణ్యక్షేత్రమైన జమలాపురం వరకు తిరువూరు నుంచి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలంటూ గంపలగూడెంకు చెందిన గట్టి గుండె ప్రకాశం అర్జీ అందించారు. తహసీల్దార్ జి బాలకృష్ణారెడ్డికి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



గంపలగూడెంలో అర్జీలు తీసుకుంటున్న అధికారులు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మందులు క్రమం తప్పకుండా వాడడంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. నిక్షయ మిత్ర కార్యక్రమంలో 200 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ద్వారా పోషకాహార కిట్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా రెండు వేల మందికి పైగా క్షయ వ్యాధితో బాధపడుతున్నారని, వారందరికీ పౌష్టికాహార కిట్లను అందించి, రోగ నిరోధక శక్తిని పెంచే విధంగా ఆరు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. క్షయ వ్యాధి పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి తగ్గకుండా పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడడం ద్వారా క్షయ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులను అశ్రద్ధ చేయకుండా వాడుకోవాలన్నారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందిస్తున్న సేవలకు తోడు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ప్రాణాంతకమైన అంటువ్యాధి అయిన క్షయ ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుందన్నారు. పౌష్టికాహారన్ని తీసుకుని వ్యాధిగ్రస్తులు త్వరితగతిన కోలుకుని ఆరోగ్యవంతులు కావాలని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమకూర్చిన 16 డిజిటల్ హిమోగ్లోబిన్ ఎనలైజర్లను వార్డు హెల్త్ సెక్రటరీలకు కలెక్టర్ ఢిల్లీరావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి.సమరం అందజేశారు.



కిట్లను పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు